
సాక్షి పల్నాడు

మంగళవారం । 26 । సెప్టెంబర్ । 2023



కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు: శ్రీకొండలమ్మ ఆలయ హుండీల్లో కానుకలను సోమవారం లెక్కించారు. 62 రోజులకు రూ.27,95,004 , 9 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండి లభించాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,706 క్యూసెక్కులు విడుదల చేశారు.

సబ్‌జైలు పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె.శ్రీసీత సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం అగ్నిమథనం, పంచగవ్యారాధన, పంచగవ్య ప్రాశన, పంచాగ్ని ప్రణయనము, ఉక్తహోమాలు నిర్వహించి పవిత్రాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, దిక్పూక్తహోమం, నవగ్రహహోమం, ప్రసాద గోష్ఠి, న్యాసం నిర్వహించి రాత్రి 8 గంటలకు పవిత్రముల శయనాధి వాసము నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. అర్చకులు పూజలు నిర్వహించారు.

ముగిసిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గత నెల 26న గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థులకు శారీరక పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మధ్యలో వర్షాల వల్ల వాయిదా పడిన పరీక్షలను తర్వాతి తేదీల్లో నిర్వహించారు. సోమవారం చివరి రోజున పరీక్షల నిర్వహణను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు పర్యవేక్షించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్/నకలు ధ్రువీకరణ పత్రాలను పోలీస్ అధికారులు, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. 81 మంది పురుష అభ్యర్థులు పోటీలో పాల్గొనగా, 39 మంది ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), విజయశేఖర్ (ఎస్సీ/ఎస్టీ) ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్‌ఐలు, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో రిటైనింగ్ వాల్ డిజైన్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగి పడకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన డిజైన్లను నాలుగు రోజుల్లో సిద్ధం చేస్తామని టెక్నికల్ కమిటీ బాధ్యుడు ఆర్.కొండలరావు తెలిపారు. దుర్గాఘాట్ ఎదుట ఇటీవల కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని టెక్నికల్ కమిటీ సోమవారం పరిశీలించింది. కమిటీ సభ్యులు ఆర్.కొండలరావు, సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ డిపార్టుమెంట్ డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, త్రిమూర్తి రాజుతో పాటు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఘాట్‌రోడ్డు వద్ద కొండను పరిశీలించారు. ఘాట్‌రోడ్డు మీదగా తాడు సాయంతో కొండ చరియలు విరిగి పడిన ప్రదేశానికి చేరుకుని అక్కడి పరిస్థితిని అంచనావేశారు. కొండ చరియలు విరిగి పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై దుర్గగుడి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాళ్లు, కొండ చరియలు విరిగి పడకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను వివరించారు. నాలుగు రోజుల్లో అవసరమైన డిజైన్లు సిద్ధం చేసి దేవస్థానానికి అందజేస్తామన్నారు. దుర్గగుడి ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 31,315 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,315 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 30,015 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,900 వరకు పలికింది. యార్డులో ఇంకా 10,152 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

సేద్య పవనాలు

సు'ఫలం'.. సుమధురం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు షేక్ సాంబశివ రావు. ఊరు నరసరావుపేట మండలం అర్వపల్లి. ఈయనకు ఉన్న 2.20 ఎకరాల పొలంలో గతంలో వరి, కంది, పత్తి పంటలను సాగుచేసేవారు. తీవ్ర నష్టాలు రావడంతో ఉద్యాన పంటల వైపు మళ్లాలని నిర్ణయించుకున్నారు. స్థానిక ఉద్యానశాఖ అధికారుల సహకారంతో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. ప్రస్తుతం ఎకరాకు ఏటా సుమారు రూ.10 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. దీంతో ఉద్యాన శాఖ ఇస్తున్న రాయితీతో మరో 2 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు.



డ్రాగన్ 'ఫూట్‌ఫుల్' : రైతు షేక్ సాంబశివరావు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్ఎస్ శ్రీధర్(ఫైల్)

ఉద్యాన పంటల ఖిల్లా 'పల్నాడు'

- 63,799 హెక్టార్లలో సాగు
- ఏటా 3,93,502 మెట్రిక్ టన్నుల దిగుబడి
- ఖర్జూర, యాపిల్ బేర్, డ్రాగన్‌ఫ్రూట్ సేద్యానికీ శ్రీకారం
- ఇప్పటికే మిర్చి పంటకు కేరాఫ్ అడ్రస్‌గా జిల్లా
- ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం



యాపిల్ కు'భేర్' : అచ్చంపేట మండలం గ్రంథసిరిలో రైతు రాంబాబు సాగుచేస్తున్న యాపిల్ బేర్ పంట

జిల్లాలో ఉద్యానపంటల విస్తీర్ణం ఇలా..

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
సుగంధ ద్రవ్యాలు	59,374.30	2,68,655.00
పండ్లు	2,874.00	89,825.45
కూరగాయలు	1,379.48	33,219.18
పూలు	171.22	1,802.37
మొత్తం	63,799	3,93,502

సాక్షి, నరసరావుపేట: పల్నాడులో వేలాది మంది రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కరోనా తర్వాత పండ్లు, కూరగాయల వినియోగం అమాంతం పెరిగింది. దీంతో వీటి సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారు. ధరలు నిలకడగా ఉండడంతో ఆశించిన స్థాయిలో ఆదాయమూ లభిస్తోంది.

3.93 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

జిల్లాలో మొత్తం 63,799 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,93,502 మెట్రిక్ టన్నుల కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పూల ఉత్పత్తి జరిగింది. ఇందులో సింహభాగం మిర్చి పంటదే. జిల్లాలో 58,524 హెక్టార్లలో మిర్చి సాగు కాగా 2,63,358 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఈ ఖరీఫ్‌లోనూ మిర్చి సాధారణ సాగు లక్ష్యం 59,797 హెక్టార్లుగా అధికారులు అంచనా వేశారు. ఇక్కడ పండే మిర్చికి దేశ,విదేశాల్లో మంచి గిరాకీ ఉంది.

'ఫల'నాడుగా ఖ్యాతి

పల్నాడు జిల్లా ఫలనాడుగా మారుతోంది. కొత్తరకం ఫలాల సాగును ఇక్కడి రైతులు ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. సాధారణంగా ఖర్జూర పంటను గుజరాత్, రాజస్థాన్, తమిళనాడుల్లో సాగు చేస్తారు. పల్నాడు జిల్లాలో కూడా ఖర్జూర పంట సాగుచేయవచ్చని కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన బాషా నిరూపించారు. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు ఉండటంతో ఇక్కడి వాతావరణం ఖర్జూర సాగుకు అనుకూలమని చూపారు.

- థాయ్‌లాండ్‌కి చెందిన యాపిల్ బేర్ పండును ఉత్తరభారత దేశంలోనే గతంలో సాగు చేసేవారు. ప్రస్తుతం అచ్చంపేట మండలం గ్రంథసిరిలో రైతు రాంబాబు నాలుగు ఎకరాల్లో సాగుచేస్తున్నాడు. యాపిల్ బేర్ పంట ఏటా అక్టోబర్ నుంచి జనవరి వరకు చేతికివస్తుంది. ఎకరానికి పది టన్నుల వరకు దిగుబడి రాగా, ఆదాయం సగటున రూ.2 లక్షల వరకూ వస్తోంది.

- పోషకాలున్న డ్రాగన్ ఫ్రూట్‌నూ ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. మాచర్ల, పెదకూరపాడు, మాచవరం, యడ్లపాడు, నరసరావుపేట మండలాల్లో ఎక్కువగా సాగవుతోంది. ఎర్ర నేలలు, అధిక ఉష్ణోగ్రతలు ఈ పంటకు అనుకూలం. తక్కువ నీటితో సాగుచేసే ఈ పంట మొక్కలు నాటిన రెండేళ్ల తర్వాత దిగుబడి వస్తుంది.

ప్రభుత్వ ప్రోత్సాహం అమోఘం

మెట్టప్రాంతం అధికంగా ఉన్న పల్నాడు జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఏటా ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతోపాటు రాయితీ, ఇతర కార్యక్రమాల ద్వారా ఏటా సుమారు రూ.13 కోట్ల వరకూ ఖర్చు చేస్తోంది. కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరిట ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, వర్ వీడర్లు పంపిణీ చేస్తోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పంటలకు రక్షక తడులు ఇచ్చేందుకు 50 శాతం రాయితీతో ఫాంపాండ్స్ తవ్విస్తోంది. మార్కెటింగ్ సదుపాయాలూ చూపుతోంది.

లాభసాటి సేద్యమే లక్ష్యం



ఉద్యాన పంటల ద్వారా అధిక లాభాలు సిద్ధిస్తాయి. కాలానుగుణంగా వస్తున్న కొత్త వంగడాలు, రకాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటే సత్ఫలితాలు సాధ్యం. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలతో పాటు ఉద్యాన శాఖ తరఫున రాయితీలు ఇస్తున్నాం. ఈ ప్రాంత పరిస్థితులు, మార్కెటింగ్ సదుపాయాల ఆధారంగా పంటలను సాగుచేయిస్తున్నాం. లాభసాటి సేద్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– బెన్నీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, పల్నాడు

దానిమ్మతో ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం



మా ప్రాంతంలో పొడి వాతావరణం, ఎర్రనేలలు కావడంతో మూడు ఎకరాల్లో దానిమ్మ పంటను సాగుచేస్తున్నా. ఈ ఏడాది జనవరిలో ఖర్చులు పోను మూడు ఎకరాలకు రూ.15 లక్షల వరకు నికర ఆదాయం లభించింది. ఉద్యాన శాఖ రాయితీతోపాటు, సాంకేతిక సలహాలు, సూచనలు అందించింది.

– పగడాల చిన్నకోటిరెడ్డి, రైతు, వితంరాజుపల్లి, వినుకొండ మండలం

సమష్టి కృషితో ఉమ్మడి జిల్లా అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో పునరంకితమవుతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ద్వితీయ వార్షిక వేడుకలను జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల జెడ్పీటీసీలు హెనీ క్రిస్టినాను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దేవుని దయ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రథమ మహిళగా ఇదే వేదికపై ప్రమాణ స్వీకారం చేసిన తాను గత రెండేళ్ల కాలంలో జెడ్పీ ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శాయశక్తులా కృషి చేశానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పించడంతోపాటు వారికి వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో ఎ.రమేష్ (క్రోసూరు), ఎన్. రామకృష్ణప్రసాద్ (రాజుపాలెం), సీహెచ్ వెంకటేశ్వర్లు (మాచర్ల), ఎం.నాగచంద్రకుమారి (పిడుగురాళ్ల), జె. శర్మ (వెల్దుర్తి), టి. శ్రీనివాసరావు (మంగళగిరి), సీహెచ్ వెంకటరవి (ఈపూరు) ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్లు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, బత్తుల అనురాధ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

లింగంగుంట్ల అగ్రహారం భూముల సర్వే ప్రారంభం



లింగంగుంట్ల భూముల సర్వేను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తదితరులు

నరసరావుపేట రూరల్: శతాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న లింగంగుంట్ల అగ్రహారం ఈనాం భూముల సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేయడం అభినందనీయమని కలెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చొరవతో పుష్పగిరి మఠం, లింగంగుంట్ల అగ్రహారం రైతులకు మధ్య ఒప్పందం జరిగిన నేపథ్యంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ రైతులకు, మఠానికి మధ్య పరిష్కారం జరగకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి చొరవతో పుష్పగిరి మఠం, రైతులకు మధ్య ఆమోదయోగ్యమైన ఒప్పందం జరిగిందన్నారు. భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలూ లేకుండా సర్వేను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గ్రామంలోని పంట భూములు, నివాసప్రాంతాలు, ఖాళీ స్థలాలు, వాణిజ్య ప్రాంతాల పూర్తి వివరాలు ఈ సర్వే ద్వారా నమోదు చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ రైతులు తరతరాలుగా భూములను అనుభవిస్తున్నారని, భూమి మీద హక్కు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పీఠానికి కూడా ఎలాంటి ఆదాయం సమకూరని పరిస్థితుల్లో రైతుల కష్టాలను తెలుసుకుని పరిష్కారం చూపాలని పీఠాధిపతి చంద్రశేఖరస్వామిని కోరినట్టు తెలిపారు. భూముల సమస్య పరిష్కారం కోసం దాదాపు 40 సార్లు పుష్పగిరి మఠానికి వెళ్లామని వివరించారు. ఈ క్రమంలో తొలి అడుగుగా రైతులు, పుష్పగిరి మఠానికి మధ్య ఒక ఒప్పందం జరిగిందని వివరించారు లింగంగుంట్ల భూముల వివరాలపై స్పష్టత లేదని, అందు కోసమే సర్వే చేపట్టినట్టు వివరించారు. సర్వే అనంతరం కోర్టు అనుమతులతో ముందుకు వెళ్తామని తెలిపారు. లింగంగుంట్లలోనే కలెక్టర్ కార్యాలయం ఉండటం వల్ల సమస్య పరిష్కారానికి వేగంగా అడుగులు పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఓబులునాయుడు, తహసీల్దార్ రమణానాయక్, పుష్పగిరి మఠం ప్రతినిధి చంద్రమౌళి, మాజీ సర్పంచ్ పొన్నపాటి ఈశ్వరరెడ్డి, కామిరెడ్డి నర్సిరెడ్డి, డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంద్యాల సత్యనారాయణరెడ్డి, పొన్నపాటి పాపిరెడ్డి, యేరువ బాలమోహనరెడ్డి, కామిరెడ్డి నాగిరెడ్డి, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్నాడుకు మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు

- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రం
- ఎంపీ లావు, ఎమ్మెల్యేలు పిన్నెల్లి, గోపిరెడ్డి కృషి ఫలితం

నరసరావుపేట: పల్నాడు జిల్లాకు మరో రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయి. మాచర్ల నియోజకవర్గంలోని తాళ్లపల్లి, నరసరావుపేట నియోజకవర్గంలోని రొంపిచర్లలో వీటి ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం ఆమోదం తెలిపింది. రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు ఆమోదం లభించగా అందులో రెండు జిల్లాకు కేటాయించడం విశేషం. ఈ విద్యాలయాల ఏర్పాటు కోసం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతోపాటు ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి(పీఆర్కే), డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విశేష కృషి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చిలకలూరిపేటలో కేంద్రియ విద్యాలయం అందుబాటులోకి వచ్చేలా ఎంపీ లావు చర్యలు తీసుకున్నారు. పల్నాట ఇప్పుడు తాజాగా మరో రెండు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటివరకు జిల్లాలోని చిలకలూరిపేట, సత్తెనపల్లిలో మాత్రమే ఈ విద్యాలయాలు నడుస్తున్నాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కేంద్రీయ విద్యాలయాలు తీసుకురావటమే లక్ష్యంగా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పనిచేస్తున్నారు.



కేంద్రీయ విద్యాలయం (ఫైల్)

ఎంతో ఉపయోగకరం



మాచర్ల మండలంలోని తాళ్లపల్లిలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు నియోజకవర్గంలోని విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెరుగైన చదువుల కోసం జిల్లా కేంద్రం, గుంటూరు, ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తప్పుతుంది. విద్యాలయం ఏర్పాటుకు కృషి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే, మాచర్ల

విద్యాసదుపాయాల మెరుగే లక్ష్యం



పల్నాడులో మెరుగైన విద్యాసదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు మంజూరు కావడం ఆనందంగా ఉంది. పల్నాడులోని ఏడు నియోజకవర్గాల్లోనూ విద్యాలయాల ఏర్పాటుకు కృషి చేస్తాను. ఇది నా లక్ష్యం.

– శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీ, నరసరావుపేట


విద్యా, వైద్యరంగాలకు కేంద్రం



విద్యా, వైద్యరంగాలకు నరసరావుపేట కేంద్రంగా ఉంది. రొంపిచర్లలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుతో విద్యాభివృద్ధి వేగంగా జరుగుతుంది. తొలి నుంచి కేంద్రీయ విద్యాలయం కోసం కృషి చేస్తున్నాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విశేష కృషి ఫలితంగా ఈ రోజు సాకారమైంది.

– గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే నరసరావుపేట

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 853.50 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయానికి జూరాల నుంచి 17,843 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

- అధికారులకు కలెక్టర్ శివశంకర్ సూచన
- 'స్పందన'కు తరలివచ్చిన ప్రజలు
- 302 అర్జీల స్వీకరణ

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపించాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' స్పందన కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 302 వినతి పత్రాలు స్పందనకు అందాయి. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో దాతలు అర్జీదారులకు ఉచిత అన్నదానం చేశారు. దాతలను జిల్లా అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం, పులిచింతల డెప్యూటీ కలెక్టర్ వసంతబాబు, జిల్లా అర్బన్ డవలప్‌మెంట్ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్



ధనపతిం భజే

రెడ్డినగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణపతిని సోమవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. దాదాపు రూ.45 లక్షల విలువైన నోట్లతో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుష్మితరెడ్డి దంపతులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్కీడ్రాలో విజేతలకు బహుమతులు అందజేశారు.

– నరసరావుపేటరూరల్

వెలి బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి



సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో 2003-04లో రెండుసార్లు సాంఘిక బహిష్కరణకు గురైన వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన నష్టపరిహారం చెల్లించాలి. నూతన జీవో ప్రకారం పరిహారం ఇవ్వాలి.

– ఇద్వా రాష్ట్ర అధ్యక్షుడు జి.రాజాసుందరబాబు, మహిళలు

మహిళను వేధిస్తున్న ఉద్యోగి



పిడుగురాళ్ల మండలం గుత్తికొండకు చెందిన గిరిజన మహిళను వేధిస్తున్న నరసరావుపేట ఎస్ఎస్‌పీ జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి. వెంటనే కలెక్టర్ స్పందించాలి.

– పీడీఎం అధ్యక్ష, కార్యదర్శులు షేక్.మస్తాన్‌వలి, రామకృష్ణ, గిరిజన సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటానాయక్

మొక్కజొన్న పంట నాశనం చేశారు..

- ఎస్పీ రవిశంకర్‌రెడ్డికి బాధితుడు ఫిర్యాదు
- జగనన్నకు చెబుదాంలో 60 అర్జీలు



సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: తన పొలంలో మొక్కజొన్న పంట వేయగా ప్రక్కనే పొలం కలిగి ఉన్న వ్యక్తి ఆ పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేశాడని, సదరు వ్యక్తిపైన చర్య తీసుకోని తగిన న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డిని మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన చట్టు బ్రహ్మం కోరారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అధ్యక్షత వహించి ప్రజల నుంచి 60 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలకు చెందిన సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు అందుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయసహకారాలు అందించారు. నరసరావుపేట పట్టణానికి చెందిన గురు మొబైల్స్ అధినేత అరుణ్‌కుమార్ అన్నదానానికి సహాయం చేయగా, నిర్వాహకులు బచ్చు వెంకట సత్యనారాయణ, పాల్వాది మధుసూదన్‌రావు, చిన్ని వెంకట శ్రీనివాస్‌రావు అన్నదానం నిర్వహించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి. రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి. మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ. యు.రవిచంద్ర పాల్గొన్నారు.

కన్న కొడుకులే పొలానికి నీరు రానీయట్లేదు

నాకు ఇద్దరు మగ పిల్లలు. వారికి సమానంగా నాకున్న పొలంలో కొంత పొలం పంచి, మిగతాది నేను ఉంచుకున్నా. అయితే వారిద్దరూ నా పొలానికి నీరు రానీయకుండా చేసి బయటి వారికి ఇస్తూ ఇబ్బంది పెడుతున్నారు. వారిని పిలిపించి నా పొలానికి నీరిచ్చేలా చర్యలు తీసుకోండి.

–ఈపూరి వెంకటేశ్వర్లు, రాజుపాలెం

వదినకు అని రూ.80 లక్షలు ఇస్తే..

నా వద్ద నా వదిన రూ.80 లక్షలు తీసుకుంది. భర్త మస్కట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. పిల్లలు ఇంజినీరింగ్ చదువుతున్నారు. తిరిగిచ్చేంత సామర్థ్యం ఆమెకు ఉన్నా డబ్బులు ఇవ్వకుండా నీకు చేతనైన వారికి చెప్పుకో పో అంటూ బెదిరిస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేయలేదు. ఆమెపై కేసు నమోదు చేసి నా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

–పూదోట చిన్నయ్య, కనపర్రు, నాదెండ్ల మండలం

డబ్బులు ఇవ్వడం లేదు..

నా వివాహం సందర్భంగా నా మామ నా తండ్రి వద్ద నుంచి రూ.లక్ష తీసుకొని తిరిగి ఇవ్వకుండా, పదే పదే అడిగితే స్థలం ఇస్తానని చెప్పి అదీ ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. డబ్బు ఇప్పించి నాకు న్యాయం చేయండి.

–ఓ మహిళ, కారెంపూడి

ఉద్యోగం పేరుతో మోసం

నేను బీటెక్ చదివాను. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఏపీ ఫెస్ట్ కన్సల్‌టెంట్‌కు చెందిన వ్యక్తి నా వద్ద నుంచి రూ.1.5 లక్షల నగదు తీసుకున్నాడు. ఉద్యోగం రాలేదు. ఫోన్ ఎత్తటంలేదు. అతడిపై కేసు నమోదు చేసి నా డబ్బులు నాకు ఇప్పించండి.

–జొన్నలగడ్డ భాస్కరరావు, గోపువారిపాలెం, ఈపూరు

మృతిచెందిన సచివాలయ ఉద్యోగి భార్యకు ఉద్యోగం

- కలెక్టరేట్ సబార్డినేట్‌గా అవకాశం
- ప్రభుత్వ కారుణ్య నియామక ఆదేశాలు అమలు చేసిన జిల్లా కలెక్టర్ శివశంకర్



మౌనికకు ఉద్యోగ నియామకపత్రాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: గ్రామ సచివాలయంలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యాన సహాయకుడి భార్యకు జిల్లా కలెక్టరేట్‌లో సబార్డినేట్‌గా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏ మౌనికకు సోమవారం నియమాక ఉత్తర్వులు అందజేశారు. దాచేపల్లి మండలం పెద గార్లపాడు గ్రామ సచివాలయంలో ఉద్యాన సహాయకుడిగా ఉద్యోగం చేస్తున్న ఏ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో ఈ ఏడాది జనవరి 21వ తేదీన మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కారుణ్య నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల మేరకు కేవలం పదో తరగతి వరకే చదివిన లక్ష్మీనారాయణ భార్య మౌనికకు మళ్లీ సచివాలయ ఉద్యోగం పొందే అవకాశం లేకపోవడంతో ఆమెకున్న విద్యార్హతను బట్టి కలెక్టరేట్‌లో ఉద్యోగం కల్పించారు. తనకు ఉద్యోగం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, అధికారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో కె.వినాయకం, ఉద్యాన జిల్లా అధికారి బీజే బెన్నీ పాల్గొన్నారు.

ఎస్ఈబీ స్టేషన్ తనిఖీ



సిబ్బందితో సమీక్షిస్తున్న నాగమద్దయ్య

క్రోసూరు: క్రోసూరు ఎస్ఈబీ స్టేషన్‌నుస్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డెప్యూటీ కమిషనర్(హెడ్ క్వార్టర్స్) పి.నాగమద్దయ్య, నరసరావుపేట ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.ఎస్.దుర్గాప్రసాద్‌తో కలసి సోమవారం సందర్శించారు. నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం రవాణా, నాటు సారా విక్రయాలు తదితర నేరాలపై ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.వినయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన పులిచింతల పోలీస్ చెక్ పోస్ట్, మాదిపాడు చెక్ పోస్టులను సందర్శించారు. వీరి వెంట ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఉన్నారు.

ఆరోగ్య రంగానికి ఫార్మసిస్టులు మూలస్తంభాలు



విద్యార్థుల ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అధికారి డాక్టర్ రవి

నరసరావుపేట: ఫార్మసిస్టులు ఆరోగ్య రంగానికి మూల స్తంభాలాంటి వారని, ప్రపంచ ఆరోగ్య పరిరక్షణలో వారి పాత్ర ఎంతో విశిష్టమైందని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి కొనియాడారు. ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా పల్నాడు రోడ్డులోని డీఎండీహెచ్ఓ కార్యాలయం ఆవరణలో ఫార్మసీ స్టెంత్‌తో హెల్త్ సిస్టం అనే నినాదంతో వేడుకలు సోమవారం నిర్వహించారు. ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.మంత్రునాయక్ మాట్లాడుతూ ప్రపంచంలో వైద్యసేవలు కొనసాగినంత కాలం ఫార్మసిస్టుల కొనసాగింపు ఉంటుందన్నారు. వారు లేనిదే ప్రజల ఆరోగ్య పరిరక్షణ అంత సులువు కాదని చెప్పారు. అనంతరం విద్యార్థుల ర్యాలీని డీఎండీహెచ్ఓ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ కార్యాలయం నుంచి బయలుదేరి పల్నాడు బస్టాండ్ మీదగా గడియారం స్తంభం వరకు కొనసాగింది. జిల్లా ఎయిడ్స్ హెచ్ఐవీ, టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ పద్మావతి, ఏరియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ దయానిధి, డెప్యూటీ డిస్ట్రిక్ ఎక్స్‌టెన్షన్ మీడియా అధికారి కే సాంబశివరావు, సిద్దార్థ, చెన్నుపాటి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా రామిరెడ్డి



పిడుగురాళ్ల: ఎస్టీయూ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా ఎల్‌వీ రామిరెడ్డి ఎన్నికయ్యారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఇప్పటి వరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న దార్ల పెదబాబు గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక అవడంతో పల్నాడు జిల్లా అధ్యక్ష పదవికి రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న ఎల్‌వీ రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న, రాష్ట్ర పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు, ఎం.రఘునాథరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్ఎం సుభాని, పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రజిత్ యాదవ్, ఆర్థిక కార్యదర్శి ఎ. ఏమండి పాల్గొన్నారు.